క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పట్టణంలోని సుబ్బరాజుపేట, ఎంవీ నగర్‌కు చెందిన కాంగ్రెస్, టీడీపీ కార్యకర్తలు 40 మంది వైఎస్సార్ సీపీలోకి చేరారు. పట్టణంలో పార్టీ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ వారందరికీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్, టీడీపీ కార్యకర్తలు ఇర్రింకుల వెంకటసత్యనారాయణ, చదలవాడ వెంకటన్న, దాసరి నిలిమా, పర్విన్, మర్తి కుమారి, టీడీపీ కార్యకర్తలు గంగరాజు, ప్రభాకర్, కేవీ సతీష్, కాళ్ళ రాజు, వీరమల్లు వరలక్ష్మీ, వస్కా ప్రభాకర్ ఉన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పిట్టా పద్మావతి, దాకే అనిల్‌కుమార్, పార్టీ నాయకులు ముంగండి కృపానందం, ఎస్‌కే ఖాన్‌భాషా, గాజుల రంగారావు, గోపిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠ మహోత్సవాలకు ఏర్పాట్లు

కొవ్వూరు: పట్టణంలో బసివిరెడ్డి పేటలో నూతనంగా నిర్మించిన శ్రీరాజ్యలక్ష్మి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠాపన మహోత్సవం ఈనెల 31వ తేదీ నుంచి ఏప్రిల్ ఆరో తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థాన చైర్మన్ దేవగుప్తాపు లక్ష్మణరావు తెలిపారు. 31న బాల కుంభస్థాపన, హోమాలు నిర్వహిస్తామన్నారు. 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పలు హోమాలు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదో తేదీ ఉదయం 9.26 గంటలకు ధనిష్ఠ నక్షత్ర యుక్త వృషభ లగ్నంలో త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి, త్రిదండి ఆహోబల రామానుజ జీయర్ పర్యవేక్షణలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం కొనసాగుతుందన్నారు. 6వ తేదీన ఆలయం వద్ద మహా అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

26న కొవ్వూరులో వాహనాల వేలం

కొవ్వూరు: ఈనెల 26న పట్టణంలో ఎస్‌ఈబీ కార్యాలయం వద్ద వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు హోండా యాక్టివా మోటారు సైకిళ్లను వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబీ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. తమ కార్యాలయం వద్ద ఉదయం 11గంటలకు ఎస్‌ఈబీ ఎస్పీ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే పాటదారులు రూ.5వేలు దరవత్తు చెల్లించాలన్నారు. ఆధార్ కార్డు సమర్పించాలన్నారు. వేలంలో వాహనం దక్కించుకున్న పాటదారుడు అదే రోజు సొమ్ము మొత్తంతోపాటు 18 శాతం జీఎస్‌టీతో కలిపి చెల్లించాలని ఎస్‌ఈబీ సీఐ శ్రీనివాసరావు సూచించారు.

పోలియోతో బాధిత చిన్నారికి చేయూత




చిన్నారి చదలవాడ విహాన్ తల్లికి ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సభ్యులు

నిడదవోలు: కంసాలిపాలెం గ్రామానికి చెందిన చదలవాడ మోహన్ కుమారుడు చిన్నారి విహాన్ కొంతకాలంగా పోలియో వ్యాధితో బాధపడుతున్నాడు. ద్వారకాతిరుమల టీటీడీ దేవస్థానానికి చెందిన ఆసుపత్రిలో ఇటీవల చిన్నారి రెండు కాళ్లకు శస్త్ర చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న నిడదవోలు మానవత సంస్థ సభ్యులు స్పందించారు. చిన్నారి విహాన్ రెండు కాళ్లకు అవసరమైన బూట్లు కొనుగోలుకు ఆదివారం రూ. 25 వేల నగదును చిన్నారి తల్లికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సుంకవల్లి రామారావు, ముళ్ళపూడి కృష్ణారావు, కొమ్మిన వెంకటేశ్వరరావు, మానవత అధ్యక్షుడు కాజ గంగరాజు, ముళ్ళపూడి కేశవరావు, తన్నీడి బోసు, గెడా రామచంద్రరావు, కొప్పుల వెంకటేశ్వరరావు, మానవత సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వలంటీర్ మృతి

గోపాలపురం: గోపాలపురం పెద్దగూడెం వలంటీరుగా పనిచేస్తున్న నక్కా నాగేశ్వరి (28) గుండె పోటుతో మృతి చెందినట్లు డాక్టర్ హేమకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెద్దగూడెంలో వలంటీర్‌గా పని చేస్తున్న నాగేశ్వరి ఆదివారం 3 గంటలకు కడుపు నొప్పిగా ఉందంటూ ఆసుపత్రికి రాగా ఆమెకు ప్రాథమిక చికిత్స చేసి, గుండెకు సంబంధించిన ఈసీజీ తీసినట్లు చెప్పారు. ప్రాథమిక చికిత్స అనంతరం వార్డులో చేర్పించినట్లు చెప్పారు. చికిత్స పొందుతూ రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఒక్కసారిగా గుండె పోటు రావడంతో ఆమె మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. వలంటర్ నాగేశ్వరికి మూడేళ్ల కుమార్తె ఉన్నారు.

మహిళా ఓటర్లే కీలకం



- **నిడదవోలు నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం**
- **మున్సిపాలిటీ, మూడు మండలాల్లోనూ వారిదే పైచేయి**
- మొత్తం ఓటర్లు 2,11,874 మంది

నిడదవోలు: నిడదవోలు నియోజకవర్గంలో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. నిడదవోలు మున్సిపాలిటీతో పాటు మూడు మండలాల్లో పురుష ఓటర్ల సంఖ్య కంటే వారే అధికంగా ఉన్నారు. 1,03,600 మంది పురుష ఓటర్లు ఉండగా 1,08,269 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 4,669 మంది ఎక్కువగా ఉన్నారు.

2009లో నియోజవర్గం ఆవిర్భావం

చారిత్రాత్మక పట్టణంగా పేరొందిన నిడదవోలు నియోజకవర్గం 2009లో ఏర్పడింది. 2009లో నిడదవోలు నియోజకవర్గం మొట్టమొదటి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇప్పటి వరకు మూడు పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా 2024 మే 13న నాల్గవసారి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుండగా నిడదవోలు నియోజకవర్గంలో నిడదవోలు మున్సిపాలిటీ, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల పరిధిలో మొత్తం 2,11,874 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 2019లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ కేతనం ఎగురవేసింది. వన్‌సైడ్ వార్‌గా సాగిన పోరులో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా జి. శ్రీనివాస్‌నాయుడు ఘన విజయం సాధించారు. ప్రజలు వైఎస్సార్ సీపీకి ఘన విజయాన్ని కట్టబెట్టారు. నియోజకరవర్గంలో నిడదవోలు పట్టణం, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో 2014 ఎన్నికల్లో 1,94,270 మంది ఓటర్లు ఉండగా 85.56 శాతం ఓట్లు పోలయ్యాయి. 2019లో నియోజకరవర్గంలో నిడదవోలు పట్టణం, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో మొత్తం 2,03,084 మంది ఓటర్లుకు 1,76,947 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో అత్యధికంగా 91,240 మంది మహిళా ఓట్లు, 85,707 పురుషుల ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గం మొత్తం 1,72,453 ఓట్లు పోలవ్వగా, మొత్తం ఓటింగ్ 87.13 శాతం నమోదయ్యింది. ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడుకి 81,001 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి బూరుగుపల్లి శేషారావుకి 59,313 ఓట్లు వచ్చాయి. 21,688 ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు గెలుపొందారు.

2024 నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
నిడదవోలు అర్బన్	16,400	18,331	00	34,731
నిడదవోలు రూరల్	28,471	29,154	03	57,628
ఉండ్రాజవరం	30,161	31,702	01	61,864
పెరవలి	28,568	29,082	01	57,651



నిడదవోలు నియోజకవర్గం మ్యాప్

జనసేన పార్టీ తరుపున పోటీ చేసిన అతికాల నాగవెంకటకుసుమాంజలి రమ్యశ్రీకి 23,073 ఓట్లు సాధించారు. నిడదవోలు నియోజకవర్గంలో 2019లో ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 2,02,599 మంది ఉండగా 2024 ఎన్నికలకు 2,11,874 మంది ఉన్నారు. 9,295 మంది ఓటర్లు పెరిగారు.

నియోజకవర్గ స్వరూపం

2009లో చేపట్టిన పునర్విభజనలో భాగంగా నిడదవోలు నియోజకవర్గం ఏర్పడింది. నిడదవోలు పురపాలక సంఘంతో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలున్నాయి. 2008 వరకు నిడదవోలు పట్టణంతో పాటు నిడదవోలు మండలాలు కొవ్వూరు నియోజకవర్గంలో ఉండేవి. ఉండ్రాజవరం మండలం తణుకు నియోజకవర్గంలో, పెరవలి మండలం పెనుగొండ నియోజకవర్గంలో ఉండేవి. 1999లో జిల్లాలో 16 నియోజకవర్గాలు ఉండేవి. ఆ సమయంలో 15 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. ఈ సమయంలో కొవ్వూరు నియోజవర్గం నుంచి పోటీ చేసిన ప్రస్తుత వైఎస్సార్ సీపీ రాష్ట్ర సలహా మండలి సభ్యుడు జీఎస్ రావు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దివంతగ నేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా జీఎస్‌రావు ఉన్నత పదవిని చేపట్టారు. జీఎస్ రావు తనయుడు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు రెండవ సారి వైఎస్సార్ సీపీ తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

క్షయ వ్యాధి నివారణకు కృషి చేసిన ముగ్గురికి అవార్డులు



డాక్టర్ వసుంధర నుంచి అవార్డు అందుకుంటున్న నల్లజర్ల ఏఎన్‌ఎం తొర్లకుంట రత్నకుమారి

నల్లజర్ల: క్షయవ్యాధి నివారణకు కృషి చేసిన ముగ్గురు వైద్య ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు అందుకున్నట్లు నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8 మందికి ఉత్తమ అవార్డులకు ఎంపికకాగా అందులో ముగ్గురు నల్లజర్ల పీహెచ్‌సీ ఉద్యోగులకు అవార్డులు దక్కడం గర్వకారణమన్నారు. నల్లజర్ల ఆరోగ్య కార్యకర్త తొర్లకుంట రత్నకుమారి, దూబచర్ల ఎం.ఎల్.హెచ్.పీ షేక్ జరీనా, దూబచర్ల ఆశా కార్యకర్త తాడినాడ అనంతలక్ష్మి ఆదివారం రాజమహేంద్రవరంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టరు వి.వసుందర చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నట్లు చెప్పారు. పీహెచ్‌సీ ఉద్యోగుల కృషి, పట్టుదల అన్నిటికీ మించి ఉద్యోగ బాధ్యతల పట్ల అంకితభావానికి గుర్తింపుగా ఈ అవార్డులు వరించాయని డాక్టర్ సిరాజుద్దీన్ అన్నారు. సీహెచ్‌ఓ పలివెల ప్రసాద్, పి.హెచ్.ఎస్ రాధాకుమారి, సూపర్‌వైజర్లు అన్నమ్మ, సత్యనారాయణ, టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ గాలంకి ఆశాజ్యోతి, జీవీవీ ప్రసాద్ అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

మానవత ఆర్థిక సహాయం

గోపాలపురం: మానవతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు గోపాలపురం మండలం మానవత సంస్థ వేళ్లచింతలగూడెంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా రోగులు, వృద్ధులు, వికలాంగులకు ఆదివారం ఆర్థిక సహాయంతో పాటు వారికి ఆవసరమైన నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. మండల మానవత చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, ఉపాధ్యక్షుడు పప్పు సత్యకృష్ణారెడ్డి, సభ్యులు కుక్కల కీర్తికుమార్, కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



యర్నగూడెంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం



ప్రతిష్ఠాపనకు తీసుకువచ్చిన స్వామి, అమ్మవార్ల విగ్రహాలు

నేడు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన

దేవరపల్లి: దేవరపల్లి మండలం యర్నగూడెంలో నూతనంగా నిర్మించిన అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 22 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వేద పండితులతో నిత్యం హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. స్వామి వారి, అమ్మవార్ల మూలవిరాట్‌కు, ఉత్సవ విగ్రహాలకు వేలాది లీటర్ల గో క్షీరంతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన దాత శ్రీకాకొళపు కాశీవిశ్వనాథం, రోహిణీ దంపతులు, శ్రీకాకొళపు వెంకటనరసింహారావు, సుశీల దంపతులు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయ శిఖర, యంత్ర బింభ స్థాపన చేశారు. స్వామి వారు, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనకు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకుడు అర్చకం వేణుగోపాల దీక్షితులు గ్రామానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం స్వామి వారు, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, రామాలయంలో కోదండ రాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో వేణుగోపాల దీక్షితులు పాల్గొంటారు. అనంతరం రాత్రికి శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన దాత కాశీవిశ్వనాథం తెలిపారు. గోవింద నామస్మరణతో యర్నగూడెం మార్మోగుతోంది. గ్రామానికి చెందిన ఆడపడుచులు, బంధువులు ఇప్పటికే గ్రామానికి చేరుకోవడంతో పండగ వాతావరణం నెలకొంది.

క్వారీ లారీ కార్మికులు సమ్మెబాట



దేవరపల్లి మండలం దుద్దుకూరులో సమ్మె చేస్తున్న క్వారీ లారీ కార్మికులు

దేవరపల్లి: దేవరపల్లి, కొవ్వూరు మండలాల్లోని పలు గ్రామాల్లో విస్తరించిన నల్లరాతి క్వారీల్లోని సింగిల్ లారీపై పనిచేస్తున్న డ్రైవర్లు, హెల్పర్లకు నూతన వేతన ఒప్పందం జరగకపోవడంతో ఆదివారం సమ్మెకు దిగారు. రెండు మండలాల్లోని దుద్దుకూరు, గౌరీపట్నం, బందపురం, లక్ష్మీపురం, కొండగూడెం, దేచర్ల, ఐ.పంగిడి గ్రామాల్లోని క్వారీల్లో సుమారు 700 మంది కార్మికులు లారీలపై పనిచేస్తున్నారు. వీరికి ప్రతి మూడేళ్లకోసారి వేతన ఒప్పందం జరుగుతుంది. ఈ మూడేళ్ల కాలపరిమితి ముగియడంతో నూతన వేతన ఒప్పందం చేయాలని యజమానులకు గత నెల 23న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం (నోటీస్) అందజేశారు. అనంతరం యజమానులు కార్మిక సంఘాల నాయకులతో చర్చించారు. వేతనాలు పెంచలేమని, వేతన ఒప్పందం చేయమని యజమానులు చెప్పడంతో చర్చలు విఫలమయ్యాయి. దీనితో సోమవారం ప్రగతిశీల కార్మిక సమాఖ్య, ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం దుద్దుకూరులోని కార్మిక సంఘాల కార్యాలయం వద్ద సమ్మె శిబిరం ఏర్పాటు చేసి సమ్మె చేపట్టారు. వేతనాలు పెంచి, అగ్రిమెంట్ చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మస్తాన్ తెలిపారు. శిబిరం వద్ద కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. దీనితో క్వారీలు, క్రషర్ల వద్ద నుంచి మెటల్ రవాణా నిలిచిపోయింది. ఎక్కడ లారీలు అక్కడే నిలిపి వేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆకాష్, ఏడుకొండలు, కొండయ్య, సత్యనారాయణ, పి. బాజీ, షేక్ షఫీ, మల్లిపూడి రామకృష్ణ, ఉండ్రాజవరపు రాజు, లోడింగ్ ట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ నాయకులు కల్లేపల్లి కార్తీక్, వెంకటేష్, విజయ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అయ్యవరంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: స్థానిక జెడ్పీ హైస్కూల్లో 1995లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అయ్యవరంలో సమావేశమయ్యారు. హైదరాబాదులో స్థిరపడిన తాండ్ర శైలజ దంపతులు బాల్య స్నేహితులందరితో కలిసి ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసారు. దాదాపు 50 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. అప్పట్లో తమకు చదువులు చెప్పిన గురువులు గొట్టిపాటి శ్రీరామ్మూర్తి, దత్తు మేడమ్, ఐడీపీ అప్పారావు, చంద్రరావును ఆహ్వానించి వారందరినీ సత్కరించారు. రెవెన్యూశాఖలో పనిచేస్తున్న పోతన రవికుమార్, అధ్యాపకులుగా పనిచేస్తున్న యర్రా సాయిబాబా, కండెపు శారద, అజీజ్‌తో పాటు ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, గుదే వెంకటసుబ్బారావు, నిమ్మలపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ గెలిపిస్తే స్వర్ణ యుగమే

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకటరావు
- రావూరుపాడులో ప్రజా ఆశీర్వాద యాత్ర



రావూరుపాడులో ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకటరావు



నిడదవోలు సుబ్బరాజుపేటలో ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

తాళ్లపూడి: రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండవసారి గెలిపిస్తే స్వర్ణ యుగాన్ని చూడవచ్చునని కొవ్వూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకటరావు అన్నారు. మండలంలోని పెద్దేవం పంచాయతీ పరిధిలోని రావూరుపాడులో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకటరావు ఆదివారం ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఈ ఐదేళ్లలో అందిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తలారి వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న జగనన్నకు మద్దతు తెలిపి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ వైస్ చైర్మన్ కొలిశెట్టి నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, సర్పంచ్‌లు తిగిరిపల్లి వెంకటరావు, గండి రాంబాబు, నాయకులు కొలిశెట్టి దొరాజీ, కవల నాగేశ్వరరావు, బట్టు సుబ్బారావు, యాదాటి శ్రీనివాస్, కె వీరాంజనేయులు, గంగారావు, ముత్యాలు, దేవరెడ్డి గంగారావు, పుప్పాల నాగయ్య, కోనాల వీర్రాజు, కొయ్యే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి

నిడదవోలు: రానున్న ఎన్నికల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కోరారు. పట్టణంలోని 17వ వార్డు సుబ్బరాజుపేటలో ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమం, అభివృద్ధితో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని ప్రజలను కోరారు. ప్రస్తుతం సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల వేళ టీడీపీ, జనసేన నేతలు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఆయన హితవు పలికారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి. శ్రీనివాస్‌నాయుడు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి మళ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పిట్ట పద్మావతి, దిరిసిన రామచంద్రరావు, ఆరుగొల్లు వెంకటేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ ఖాన్‌భాషా, గంగుల గోపియాదవ్, ఆలమూరు రాజా, బుంగ ప్రసాద్, తోలేటి కోటేశ్వరరావు, కేసరపల్లి పద్మ, తాంబే రామలక్ష్మి, ముప్పిడి చిట్టి కుమారి, విజయ, సత్తమ్మ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు



నిడదవోలులో మట్టలతో ఊరేగుతున్న కృపాధార లూథరన్ చర్చి విశ్వాసులు



బ్రాహ్మణగూడెంలో మట్టలతో ఊరేగుతున్న పాస్టర్లు, విశ్వాసులు

నిడదవోలు: పట్టణంలో పలు చర్చిల్లో ఆదివారం మట్టలాదివారం (పామ్ సండే)పండుగను క్రైస్తవ సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మట్టలాదివారం క్రైస్తవులకు ఎంతో ప్రాముఖ్యమైన, పవిత్రమైనదిగా క్రైస్తవ సోదరులు భావిస్తారు. పట్టణంలో కృపాధార లూథరన్ చర్చి, క్రీస్తు మందిరం, బైబిల్ మిషన్ తదితర క్రీస్తు సంఘాల ఆధ్వర్యంలో విశ్వాసులు పూలతో అలంకరించిన మట్టలను పట్టుకుని పట్టణ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. స్థానిక కృపాధార లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ బి.ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో మట్టలాదివారం ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ఆయా సంఘ కాపరుల ఆధ్వర్యంలో ప్రత్యేక క్రీస్తు ఆరాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బేటి జయకుమార్, మందెల శ్యాంబాబు, వరసాల జాన్‌రత్నం, అక్కాబత్తుల ప్రభు, డేనియల్ రాజు, పెదపాటి శివకుమార్, పల్లి బంగారు రాజు, తూరుగోపు సునీల్‌రత్నం, గుమ్మాపు హల్లెలూయ, తాళ్ళూరి రమేష్ పాల్గొన్నారు.

హోసన్నా విజయోత్సవ ర్యాలీలు

నిడదవోలు రూరల్: మండలంలోని పలు గ్రామాల ఆర్సీఎం, బెతేస్థ ప్రార్థన మందిరం, బైబిల్ మిషన్ చర్చిల్లో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామ వీధుల్లో సంఘ విశ్వాసులు హోసన్నా విజయోత్సవ ర్యాలీలు చేశారు. సమిశ్రగూడెం, పురుషోత్తపల్లి, శెట్టిపేట, పెండ్యాల, డి.ముప్పవరంలోని పలు ప్రార్థన మందిరాల్లో ఆరాధనలు నిర్వహించారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఉండ్రాజవరం: మట్టల ఆదివారం సందర్భంగా మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉండ్రాజవరం లూథరన్ చర్చి, బైబిల్ మిషన్ చర్చితో పాటు తాడిపర్రు, చివటం, వేలివెన్ను, సూర్యారావుపాలెం, మోర్త, పాలంగి గ్రామాల్లో దేవాలయాల్లో ఈత మట్టలకు పూలతో అలంకరించారు. ఉండ్రాజవరం లూథరన్ చర్చి పాస్టర్ ఇజ్రాయిల్ మాట్లాడుతూ మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు. ముందుగా మట్టలను చేతపట్టుకుని గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

తాళ్లపూడి మండలంలో ..

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో మట్టల ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మలకపల్లిలోని ఇమ్మనుయేలు లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో గ్రామంలో మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరిష్ పాస్టర్ రె. బి.జోసెఫ్ రాజు, సంఘస్తులు సండేస్కూల్ పిల్లలు పాల్గొన్నారు. వేగేశ్వరపురం, పైడిమెట్ట, అన్నదేవరపేట గ్రామాల్లో మట్టలను పూలతో అలంకరించి ర్యాలీ నిర్వహించారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: మండలంలో క్రైస్తవులు పవిత్ర మట్టల ఆదివారాన్ని ఆయా ప్రార్థనా మందిరాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణగూడెంలో బైబిల్ మిషన్ ప్రార్థన మందిరం పాస్టర్ ఎస్ దేవదాసు, శ్యాంబాబు ఆధ్వర్యంలో విశ్వాసులు గ్రామం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. చాగల్లు, ఊనగట్ల, మార్కొండపాడు, చిక్కాల, దారవరం చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.